

గుమ్మడిదలలో రిలే నిరాహార దీక్షలో షైన్‌యూత్ సభ్యులు, జేఏసీ నాయకులు



కొత్తపల్లి రిలే నిరహార దీక్షలో కూర్చున్న గ్రామస్తులు



నల్లవల్లిలో రిలే నిరాహార దీక్షలో మాట్లాడుతున్న నాయకులు

## అడవిని కాలుష్యమయం చేస్తే ఊరుకోం

గుమ్మడిదల/నర్సాపూర్, మార్చి 9 : ప్యారానగర్‌లో డంపింగ్‌యార్డు ఏర్పాటు చేసి అడవిని కాలుష్యమయంగా మారుస్తామంటే ఊరుకునే ప్రసక్తే లేదని జేఏసీ నాయకులు హెచ్చరించారు. సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం ప్యారానగర్‌లో డంపింగ్‌యార్డుకు వ్యతిరేకంగా నర్సాపూర్‌లో చేపట్టిన రిలే నిరాహార దీక్ష ఆదివారం నాటికి 19వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ.. డంపింగ్‌యార్డు నిర్మాణంతో నర్సాపూర్ అడవితో పాటు రాయారావు చెరువు కాలుష్యం అవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. డంపింగ్‌యార్డు నిర్మాణాన్ని నిలిపే వరకు ఉద్యమం కొనసాగిస్తామని తెలిపారు. ఇప్పటికైనా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి డంపింగ్‌యార్డు నిర్మాణాన్ని నిలిపివేయాలని డిమాండ్ చేశారు. దీక్షలో జేఏసీ నాయకులు దేవేందర్‌యాదవ్, మహేశ్‌గౌడ్, దయానంద్, నరేందర్‌చారి పాల్గొన్నారు. గుమ్మడిదల మండలంలో రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. ఆదివారం గుమ్మడిదలలో 33వ రోజు రిలే నిరాహార దీక్షలో షైన్ యూత్ సభ్యులు పాల్గొన్నారు. నల్లవల్లి, కొత్తపల్లి గ్రామాల్లో 33వ రోజు రిలే నిరాహార దీక్షల్లో గ్రామస్తులు పాల్గొన్నారు. దీక్షల్లో రైతు జేఏసీ అధ్యక్షుడు చిమ్ముల జైపాల్‌రెడ్డి, రాంరెడ్డి, తుల సీదాసు, నరేందర్‌రెడ్డి,కరుణాకర్, బానోతు ఆంజనేయులు, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



నర్సాపూర్‌లో రిలే నిరాహార దీక్ష చేస్తున్న జేఏసీ నాయకులు

## కోనేరులో మునిగి విద్యార్థి మృతి



మృతదేహాన్ని వెలికితీస్తున్న సిబ్బంది

శివ్వంపేట, మార్చి 9: కోనేరులో స్నానానికి వెళ్లిన ఓ విద్యార్థి మృతి చెందిన ఘటన శివ్వంపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని సికింద్లాపూర్ పంచాయతీ పరిధిలో గల లక్ష్మీనర్సింహస్వామి ఆలయం వద్ద ఆదివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రతి ఆదివారం లక్ష్మీనర్సింహస్వామి జాతరకు భక్తులు అధిక సంఖ్యలో వస్తుంటారు. హైదరాబాద్ గబ్బిలాల్‌పేట్‌కు చెందిన ఓ కుటుంబం స్వామి వారి దర్శనానికి వచ్చింది. ఆ కుటుంబానికి చెందిన కరుణాకర్ 8వ తరగతి చదువుకుంటున్నాడు. ఆ విద్యార్థి ఆలయం వద్ద గల కోనేరులో స్నానానికి దిగాడు. దీంతో నీటిలో ఊపిరాడక మృతి చెందాడు. మృతదేహాన్ని నర్సాపూర్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ఎస్సై మధుకర్‌రెడ్డిని వివరణ కోరగా ఇంకా ఫిర్యాదు అందలేదని తెలిపారు.

## చర్చిలో మొక్కులు చెల్లించుకున్న భక్తులు



భక్తులనుద్దేశించి దైవసందేశం వినిపిస్తున్న పాస్టర్ జైపాల్

మెదక్ మున్సిపాలిటీ, మార్చి 9: మెదక్ చర్చిలో భక్తులు ఆదివారం ప్రార్థనలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. చర్చి పాస్టర్లు జైపాల్, డేవిడ్, శ్రీనివాస్ భక్తులనుద్దేశించి దైవసందేశం వినిపించారు. ఈ సందర్భంగా ఆలపించిన ఏసయ్య భక్తిగీతాలు ఆకట్టుకున్నాయి. ప్రార్థనల్లో చర్చి కమిటీ సభ్యులు గంట సంపత్, జయరాజ్, శాంశన్‌సందీప్, సువణ్‌డగ్లస్, ప్రాంక్‌జాన్స న్, ప్రభుదాస్, దేవరాజ్, నోబుల్‌సన్ పాల్గొన్నారు.

### మూల్యాంకన పారితోషికం చెల్లించాలి

మెదక్ మున్సిపాలిటీ, మార్చి 9: గతేడాది పదో తరగతి పరీక్షల మూల్యాంకనం చేసిన ఉపాధ్యాయులకు పారితోషికం వెంటనే చెల్లించాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సుంకరి కృష్ణ, స్వామ్య నాయక్ ఆదివారం డిమాండ్ చేశారు. త్వరలో పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయని పేర్కొన్నారు. విద్యాశాఖ అధికారులు స్పందించి మూల్యాంకనం చేసిన పారితోషికాన్ని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

### యూనియన్ బ్యాంకులో చోరీకి యత్నం

శివ్వంపేట, మార్చి 9: మండలంలోని దొంతి గ్రామంలో ఉన్న యూనియన్ బ్యాంకులో ఆదివారం అర్ధరాత్రి దుండగులు చోరీకి యత్నించినట్లు ఎస్సై మధుకర్‌రెడ్డి తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. దొంతి యూనియన్ బ్యాంకులో ఆదివారం అర్ధరాత్రి పెద్ద శబ్దం వచ్చింది. ఇది గమనించిన బిల్డింగ్ యజమాని వెంటనే అసిస్టెంట్ మేనేజర్‌కు ఫోన్ చేసి చెప్పాడు. బ్యాంకు వద్దకు చేరుకున్న అసిస్టెంట్ మేనేజర్ పరిశీలించగా, కిటికీలు డ్యామేజ్ అయ్యాయి. ఈ విషయాన్ని వెంటనే పోలీసులకు తెలిపారు. అసిస్టెంట్ మేనేజర్ కునాల్ గౌతమ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

### ఉరేసుకుని మహిళ ఆత్మహత్య



మహేశ్వరి మృతదేహం

కౌడిపల్లి, మార్చి 9: కడుపు నొప్పి భరించలేక ఉరేసుకుని మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని మహమ్మద్‌నగర్ గ్రామంలో ఆదివారం చోటుచేసుకున్నది. కౌడిపల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఎద్దుల మహేశ్వరి (27) కొన్ని రోజులుగా కడుపు నొప్పితో బాధపడుతున్నది. నొప్పి భరించలేక తన ఇంట్లో చీరతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఇది గమనించిన ఆమె భర్త ఆమెను కిందికి దించి 108లో నర్సాపూర్ ప్రభుత్వ దవాఖానకు తరలించాడు. అక్కడ పరిశీలించిన వైద్యులు ఆమె అప్పటికే మృతిచెందినట్లు ధ్రువీకరించినట్లు ఎస్సై తెలిపారు. మృతురాలి తండ్రి నాగప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు .

### సంగీతకు అవార్డు



ఫ్యామిలీ కౌన్సిలర్ నుంచి అవార్డు స్వీకరిస్తున్న సంగీత

సికింద్రాబాద్, మార్చి 9: ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం సంబురాలు ఘనంగా జరిగాయి. అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ నిర్వహించిన వీర నారీమణి అవార్డులలో ఉచిత న్యాయ సలహాలు అందజేస్తున్న లాయర్ సంగీతకు ప్రియాచౌదరి ఫ్యామిలీ కోచ్, ఫ్యామిలీ కన్సల్టెంట్ అవార్డును అందజేశారు. సంగీత మాట్లాడుతూ తన సేవలను గుర్తించి అవార్డు ఇవ్వడం సంతోషంగా ఉందని తెలిపారు. ప్రస్తుత కాలంలో ప్రతిరంగంలో మహిళలు విజయాఢంకా మోగిస్తున్నారని సందర్భంగా గుర్తు చేశారు.

## విద్యార్థులకు మెనూ పక్కాగా అమలు చేయాలి



భోజనాలు రుచిగా ఉన్నాయా అని అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ రాహుల్‌రాజ్



హవేలీఘనపూర్ బాలికల గురుకుల పాఠశాలలో వంటలను పరిశీలిస్తున్న కలెక్టర్

- గురుకులాలు, వసతి గృహాల్లో శుభ్రత చర్యలు చేపట్టాలి
- విద్యార్థులు లక్ష్యాలను సాధించాలి
- కలెక్టర్ రాహుల్ రాజ్

మెదక్ మున్సిపాలిటీ, మార్చి 9: గురుకులాలు, వసతి గృహాల్లో రోజూ వారి మెనూ పక్కాగా అమలుచేయాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులను ఆదేశించారు. ఆదివారం హవేళీఘనపూర్ మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబా పూలే బాలికల గురుకుల పాఠశాలను తనిఖీ చేశారు. పాఠశాలలోని వంటగది, సరుకుల నిల్వ, పప్పులు, వంట నూనె, బియ్యం, కూరగాయలు, ఆకుకూరలు పరిశీలించి, నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. అనంతరం పాఠశాలలోని ప్రయోగశాల, మరుగుదొడ్లు, మూత్రశాలలు, తరగతి గదులను తనిఖీ చేసి, నిత్యం శుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. విద్యార్థుల హాజరు పట్టిక, సరుకుల నిల్వ, వార్డెన్ల హాజరు రిజిష్టర్లను పరిశీలించారు. అనంతరం విద్యార్థినులతో మాట్లాడుతూ ఎలా చదువుతున్నారు, ఉదయం అల్పహారం, మధ్యాహ్న భోజనం సమయానికి అందిస్తున్నారా అంటూ అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినుల అభ్యాసన సామర్థ్యాలను పరిక్షించి, చక్కగా చదువుకోని లక్ష్యాలు సాధించాలని సూచించారు.

### గ్రామ పంచాయతీ ట్రాక్టర్ డ్రైవర్ మృతి



మెదక్ రూరల్, మార్చి 9: మెదక్ మండలం భూపతిపూర్ గ్రామ పంచాయతీ ట్రాక్టర్ డ్రైవర్ మాల రాజు (35) ఆదివారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. పని ఒత్తిడితో సరైన సమయంలో భోజనం చేయక అవస్థకు గురై మృతిచెందినట్లు వారు పేర్కొన్నారు. రాజు ఆరేండ్లుగా గ్రామ పంచాయతీ ట్రాక్టర్ డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. రాజు మృతితో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. రాజు మృతిచెందిన సంగతి తెలుసుకున్న గ్రామ పంచాయతీ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఆసిఫ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు డబ్బులు చందా చేసి అంత్యక్రియలు నిర్వహించారు. అంత్యక్రియల్లో రాజయ్య, ముత్తయ్య, నర్సింహులు, ప్రవీణ్, మహేశ్, చందు, లక్ష్మి, బాలమణి, దుర్గమ్మ పాల్గొన్నారు.

### హనుమాన్ ఆలయానికి రూ.25వేల విరాళం



చిలిపిచెడ్, మార్చి 9: మండలంలోని గౌతాపూర్ గ్రామంలో శ్రీ ఆంజనేయ స్వామి ధ్వజ స్తంభ, నవగ్రహ విగ్రహ పతిష్ఠాపన కార్యక్రమానికి ఓ దాత రూ.25 వేల నగదు, బియ్యం అందజేశారు. ఆదివారం గౌతాపూర్‌లో కొనసాగుతున్న హనుమాన్ ఉత్సవాల్లో భాగంగా మండలంలోని సోమక్కపేట గ్రామానికి చెందిన శ్రీకాంత్‌గౌడ్ గుడికి రూ.25 వేల విరాళాన్ని అందజేశారు. అనంతరం 50 కిలోల బియ్యం పంపిణీచేశారు. కార్యక్రమంలో గౌతాపూర్ గ్రామస్తులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### మూల మలుపులు.. మృత్యు కుహారాలు

సూచిక బోర్డుల్లేక ఇబ్బందులు పడుతున్న వాహనదారులు



ప్రమాదకరంగా ఉన్న మూల మలుపులు



సూచిక బోర్డు లేకుండా ఉన్న బీటీ రోడ్డు చౌరస్తా

మిరుదొడ్డి, మార్చి 9: మూల మలుపులతో ప్రమాదాలు జరుగుతున్నా ప్రభుత్వం పట్టించుకున్న దాఖలాలు కనబడడం లేదు. మిరుదొడ్డి టౌన్ మీదుగా ఆయా గ్రామాలకు ప్రజలు, ప్రభుత్వ ఉద్యోగస్తులు జిల్లా కేంద్రం సిద్దిపేటకు వెళ్తుంటారు. ధర్మారం మీదుగా కాకుండా ఈ బీటీ రోడ్డు వెంట వెళ్తే సుమారు 4 కిలోమీటర్ల దూరం తగ్గుతుంది. మిరుదొడ్డి నుంచి కొండాపూర్ దుబ్బాక మండలంలోని పద్మణాభునిపల్లి, తిమ్మాపూర్ నుంచి సిద్దిపేటకు వెళ్తుంటారు. దీంతో సమయం ఆదా అవుతుంది. దూర భారం కూడా తగ్గుతుంది.

#### సూచిక బోర్డుల్లేక ప్రమాదాలు

మిరుదొడ్డి టౌన్ నుంచి కొండాపూర్ వరకు 3 ప్రమాదకర మూల మలుపులు, 2 చౌరస్తాలు ఉన్నాయి. బీటీ రోడ్డు మూల మలుపుల వద్ద ఎలాంటి సూచిక బోర్డులు లేవు. దీంతో వాహనదారులు ప్రమాదాలకు గురైన ఘటనలు ఎన్నో ఉన్నాయి. ప్రజల ప్రాణాలు కాపాడడానికి రాష్ట్ర ప్రభుత్వం తగు చర్యలు తీసుకుని మూల మలుపులు, చౌరస్తాల వద్ద సూచి బోర్డులు ఏర్పాటు చేసి ప్రమాదాలను నివారించాలని ప్రజలు కోరుతున్నారు.

## మిస్టరీగా బీదర్ రాబరీ!

- పకడ్బందీగా ప్రధాన రహదారులపై పోలీసుల తనిఖీలు
- పోలీసుల కళ్లు కప్పి తిరుగుతున్న దోపిడీ దొంగలు
- సంగారెడ్డి జిల్లా మీదుగా హైదరాబాద్‌కు ఎలా వెళ్లారు?
- లోతుగా నిఘా వర్గాలు దర్యాప్తు
- దొంగల కోసం రెండు రాష్ట్రాల పోలీసుల ముమ్మరంగా గాలింపు




కర్ణాటక రాష్ట్రం బీదర్ జిల్లా సరిహద్దు ప్రాంతంలోని సుల్తాన్‌పూర్ గ్రామ చౌరస్తాలో సీసీ కెమెరాలో నమోదైన దొంగలు బైక్‌పై వెళ్తున్న దృశ్యాలు

జహీరాబాద్, మార్చి 9: సంగారెడ్డి జిల్లా సరిహద్దు ప్రాంతంలోని కర్ణాటక రాష్ట్రం బీదర్ జిల్లా కేంద్రంలో రాబరీ మిస్టరీగానే మిగిలిపోయింది. పట్టపగలే అందరూ చూస్తుండగానే సీఎంఎస్ సెక్యూరిటీ, ఉద్యోగులపై కాల్పులు జరిపి ఏటీఎంలో భద్రపర్చనున్న రూ.93 లక్షలను దొంగలు ఎత్తికెళ్లిన విషయం తెలిసిందే. రెండు రాష్ట్రాల పోలీసుల కళ్లు కప్పి దొంగలు సంగారెడ్డి జిల్లా మీదుగా హైదరాబాద్‌కు ఎలా వెళ్లారు. అక్కడ నుంచి పారిపోయే క్రమంలో కాల్పులకు పాల్పడడంతో నిఘా వర్గాలు లోతుగా దర్యాప్తు చేపడుతున్నారు. కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన నిఘా వర్గాల బృందాలు జిల్లాలోని న్యాల్‌కల్ మండలంలో పలు ప్రాంతాల్లో ఉన్న సీసీ కెమెరాల్లో దోపిడీ దొంగలు బైక్‌పై వెళ్తున్న దృశ్యాలను పరిశీలించారు. కర్ణాటక పోలీసుల ఆదేశాల మేరకు బీదర్ సరిహద్దు ప్రాంతంలోని తెలంగాణలో వచ్చే బీదర్-జహీరాబాద్, నాగల్‌గిద్దా-నారాయణఖేడ్, జహీరాబాద్-నారాయణఖేడ్, ఝరాసంగం, అల్లాదుర్గం-మెటల్‌కుంట, హైదరాబాద్-ముంబయి ప్రధాన రోడ్డు మార్గాల్లో రెండు రాష్ట్రాల పోలీసులు ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. దోపిడీ దొంగలు డబ్బుల పెట్టెతో బైక్‌పై బీదర్ పట్టణ సమీపంలోని సుల్తాన్‌పూర్ గ్రామ చౌరస్తాలో ఉన్న సీసీ కెమెరాలో న్యాల్‌కల్ వైపు వస్తున్న దృశ్యాలు రికార్డయ్యాయి. అక్కడ నుంచి న్యాల్‌కల్, మనూర్, రాయికోడ్, మునిపల్లి, సంగారెడ్డి, జోగిపేట్, పటన్‌చెరు ప్రాంతాల్లోని సీసీ కెమెరాల్లో దొంగలు వెళ్తున్న దృశ్యాలు నమోదు కాకపోవడం పోలీసులకు అంతుపట్టడంలేదు. రెండు రాష్ట్రాలకు చెందిన పోలీసుల కళ్లు కప్పి అడ్డదారుల్లో దొంగలు ఎలా చేరుకున్నారనే కోణంలో నిఘా వర్గాలు దర్యాప్తు చేస్తున్నాయి. బంగారు ఆభరణాలు తరలించే వ్యక్తులు, స్థిరాస్తి వ్యాపారులు, బ్యాంకులే లక్ష్యంగా దోపిడీ దొంగలు పక్కా ప్రణాళికలతో ఆయా ప్రాంతాల్లో చోరీలకు పాల్పడుతున్నారు. ఇందుకు దొంగలు జహీరాబాద్‌ను సరైన ప్రాంతంగా ఎంచుకున్నారు. రెండు, మూడు సంవత్సరాల క్రితం ప్రజాప్రతినిధులు, కంపెనీలు, దాతల సహకారంతో ప్రధాన రోడ్డు మార్గాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు దాదాపు పనిచేయడం లేదని తెలిసింది. సీసీ కెమెరాలు ఉన్న చోటనే జరిగిన దొంగతనం ఘటనలో మాత్రమే దొంగలను గుర్తించడం సాధ్యమవుతుంది. ఏది ఏమైనప్పటికీ దొంగలు రాష్ట్రంలో దొంగతనాలు చేసి కర్ణాటకకు, అక్కడ దొంతనాలు చేసి రాష్ట్రానికి వస్తూ.. పోలీసులకు సవాల్ విసురుతున్నారు.



వాహనాల్లో వచ్చిన కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల పోలీసులు నిఘా బృందాలు

### చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి



చెరువులో గాలిస్తున్న అధికారులు

రామాయంపేట రూరల్, మార్చి 9: చేపల వేటకు వెళ్లి చెరువులో గల్లంతై వ్యక్తి మృతి చెందిన ఘటన రామాయంపేట మున్సిపాలిటీలోని గొల్పర్తి గ్రామంలో ఆదివారం జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. పేరాని నర్సింహులు(25) మత్స్యకారులతో కలిసి గ్రామ శివారులోని చెరువులో చేపల కోసం వేటకెళ్లాడు. ఈ క్రమంలో గల్లంతయ్యాడు. స్థానికులు ఈ విషయాన్ని పోలీసులకు తెలిపారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడికి భార్య, కూతురు ఉన్నారు.

### మహిళలకు పనికి తగిన వేతనం ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న నర్సమ్మ


మెదక్ మున్సిపాలిటీ, మార్చి 9: మహిళలకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, పని చేసే ప్రదేశాల్లో రక్షణ కల్పించాలని శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ కడారి నర్సమ్మ డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని కేవల్ కిషన్ భవన్‌లో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకురాళ్లు యశోద, కవిత, స్వరూప, రేణుక, వరలక్ష్మి, వీరమణి, రమాదేవి, మంజుల, లక్ష్మి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

### నిరుపేద వధువుకు ఆర్థిక సాయం



రామాయంపేట రూరల్, మార్చి 9: మండలంలోని ఝాన్సీలింగాపూర్ పంచాయతీ సదాశివనగర్ తండాకు చెందిన జర్పోత్ కమలవ్వ కూతురు వివాహం ఆదివారం జరిగింది. ఆమె వివాహానికి బీఆర్‌ఎస్ మెదక్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంఠారెడ్డి తిరుపతిరెడ్డి రూ.5 వేలు ఆర్థిక సాయాన్ని బీఆర్‌ఎస్ నాయకుడు బానప్పగారి నర్సారెడ్డి ద్వారా అందజేశారు.

### సీసీ రోడ్డు పనులు ప్రారంభం



నిజాంపేట, మార్చి 9: నిజాంపేటలోని పెద్దమ్మతల్లి ఆలయ ఆవరణలో సీసీ రోడ్డు పనులు ఆదివారం ప్రారంభమయ్యాయి. నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ రోడ్డు పనులు చేపట్టాలని సదరు కాంట్రాక్టర్‌కు మాజీ సర్పంచ్ సత్యనారాయణ, నాయకులు మహేందర్, మారుతి, నసీరొద్దీన్, ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు పంజా బాబు సూచించారు.

### పుస్తెమట్టెలు అందజేత



నిజాంపేట, మార్చి 9: శౌకత్‌పల్లి తండాలో రమావత్ రాజు, బుజ్జి దంపతుల కూతురు వివాహానికి లీలా గ్రూప్ చైర్మన్ మోహన్‌నాయక్ పుస్తెమట్టెలను ఆదివారం అందజేశారు.